www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 117 | | 16-10-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు!



- న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు ఫలించవు
- ఇండియా కూటమి నిరసనలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సుప్రీంకోర్టులో విచారణ

4

## ఆసియా పతక విజేతలతో మోదీ భేటీ

- 85 పతకాలతో భారత్ సత్తా.. విజేతలకు ప్రధాని అభినందనలు
- మహిళా అథ్లెట్ల ఖాతాలో 38 పతకాలు.. 11 స్వర్ణాలు
- 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం
- కొత్త ఛాంపియన్లు, రికార్డులే లక్ష్యంగా క్రీడాకారులకు పిలుపు

7




## ఇమ్రాన్ ఖాన్‌కు షాక్..

28లోగా దేశం విడిచి వెళ్లాలని ముంబై పోలీసుల ఆదేశం

- భారత పౌరుడు కాకపోయినా నిరసనలో పాల్గొన్నందుకు చర్యలు
- ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఇమ్రాన్
- ఆయన అమెరికా పౌరుడని, ఓసీఐ కార్డు హోల్డర్ అని సమాచారం

4



# ఎల్‌నినో చాలా తీవ్రమైంది!



### ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళిక

- నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి
- రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి
- ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం
- వచ్చే సీజన్లో రైతులు వరి పంట వేయొద్దు
- తాగునీటికే క్లిష్టమైన పరిస్థితి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

"ప్రస్తుత ఎల్‌నినో గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఉందని, ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సాగు, తాగునీటితో పాటు విద్యుత్ కొరత ఏర్పడేలా క్లిష్ట పరిస్థితులు తలెత్తుతున్నాయని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతలు కాకుండా మార్చి మాసపు ఎండలు కాయడం, విద్యుత్ డిమాండ్ అకస్మాత్తుగా 20 వేల మెగావాట్లకు చేరుకోవడం తీవ్రతకు నిదర్శనమని తెలిపారు."

**హైదరాబాద్, అక్టోబర్ 15:** ప్రస్తుత ఎల్నినోను ఎదుర్కొనడానికి అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి ఒక కార్యాచరణను రూపొందించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇది గతంలో వొచ్చిన ఎల్నినోలకంటే తీవ్రమైందన్నారు. నీటికొరత ఏర్పడే పరిస్థితి వున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడుతోంది. వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు. 56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. అంటే అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలోని 30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి. మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లో ఉంది. డిప్యూటీ సీఎం భట్టి, విద్యుత్ శాఖ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధిని

మిగతా 2 లో



## కరువుకు కాంగ్రెస్ కారణమా?

కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

- బీఆర్ఎస్‌పై రేవంత్ ధ్వజం
- విదేశాల్లోనూ ఎల్‌నినో ప్రభావం.. అక్కడ కూడా కాంగ్రెస్ ఉందా?
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టారని ఆరోపణ
- సాగునీటి, విద్యుత్ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని విమర్శ
- బహిరంగ విచారణకు సిద్ధం..
- అసెంబ్లీ చర్చకు రావాలని సవాల్

2




## రైతులకు ఎకరానికి 10 వేల పరిహారం?

- ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన పంటలకు ఆర్థిక సాయం?
- తీవ్ర వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కసరత్తు
- శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం
- జిల్లాల వారీగా పంట నష్టంపై సమీక్ష.. పరిహారంపై తుది నిర్ణయం?
- కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు కోరేందుకు ప్రతిపాదనలు
- సర్వే పూర్తయ్యాక రైతుల ఖాతాల్లో నేరుగా పరిహారం జమ చేసే ప్రణాళిక

2

## భార్య ఘాతుకం!

### నిద్రలోనే భర్తపై పెట్రోల్ పోసి నిప్పు..

- వివాహేతర సంబంధం అనుమానంతో రగిలిన కుటుంబ కలహాలు
- నారాయణపేట జిల్లా మద్వార్ గ్రామంలో దారుణ ఘటన

2



## సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా!

- రేవంత్ సర్కారుపై కేటీఆర్ సంచలన అవినీతి ఆరోపణలు
- ప్రతి ప్రాజెక్టులో కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని విమర్శ
- నిర్మాణ సంస్థ ఎండీ రాసినట్లు చెబుతున్న లేఖ విడుదల
- రేడియల్ రోడ్డు టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణ

3



## 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

.. వివరాలు 3లో



## సింగరేణిని దెబ్బతీసింది బీఆర్ఎస్సే!

సింగరేణిలో 18 గనులను మూసివేసి 40 వేల మంది కార్మికుల జీవితాలను రోడ్డున పడేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సింగరేణి విషయంలో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్ల అధికారంలో గనుల వేలంపాటలో పాల్గొనకుండా సింగరేణికి అన్యాయం చేసిన మీకు ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు.



- 18 గనులను మూసేసి 40 వేల మంది కార్మికులను ఆగం చేసింది
- పదేళ్లు సింగరేణికి అన్యాయం చేసి ఇప్పుడు మొసలి కన్నీరు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక





# రైతులకు ఎకరానికి 10 వేల పరిహారం?

## ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన పంటలకు ఆర్థిక సాయం అందించే యోచన

**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయిన తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పంట నష్టం తీవ్రతను అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఎకరానికి రూ.10 వేల పరిహారం చెల్లింపుపై ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు వెలువడినట్లు నిర్ధారణ కాలేదు. పంట నష్టపరిహారం, కరువు సహాయక చర్యలపై చర్చించేందుకు శుక్రవారం సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు వ్యవసాయ, ఇంధన శాఖ మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు ఈ సమావేశంలో పాల్గొనేలా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా పంట నష్టం, వర్షాభావ తీవ్రత, రైతుల ఆర్థిక పరిస్థితులపై సమీక్షించి పరిహారం విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే సమావేశం నిర్వహణ, ఎజెండాపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, పత్తి, జొన్నతోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, చెరువుల్లో నీటి నిల్వలు క్షీణించడం వంటి కారణాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో పంట దిగుబడులు తగ్గిపోగా, మరికొన్ని చోట్ల పంటలు పూర్తిగా ఎండిపోయినట్లు సమాచారం. అయితే మొత్తం ఎన్ని ఎకరాల్లో నష్టం జరిగిందనే విషయంపై అధికారిక గణాంకాలు వెల్లడి కావాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. జిల్లాల వారీగా పంట నష్టం, భూగర్భ జలాల పరిస్థితి, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ రంగంపై పడిన ప్రభావానికి సంబంధించిన సమగ్ర నివేదిక రూపొందించి కేంద్రానికి పంపించే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. విపత్తు సహాయక నిధుల నిబంధనల ప్రకారం తెలంగాణకు అదనపు ఆర్థిక సాయం అందించాలని కోరే అవకాశం ఉంది. పంట నష్టం అంచనాల కోసం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టే అంశం కూడా ప్రతిపాదనల్లో ఉన్నట్లు సమాచారం. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి అర్హులను గుర్తించిన తర్వాత నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ చేసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సర్వే నిర్వహణ, అర్హత ప్రమాణాలు, పరిహారం చెల్లింపు తేదీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వర్షాభావంతో పంటలు దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు నష్టపరిహారం అందితే కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఎకరానికి రూ.10 వేల చొప్పున సాయం అందించే ప్రతిపాదన అమల్లోకి వస్తే పంట పెట్టుబడులు కోల్పోయిన రైతులకు ఊరట కలగనుంది. అయితే పరిహారం ఎంత? ఏ పంటలకు వర్తిస్తుంది? ఏ జిల్లాల్లో అమలు చేస్తారు? ఎప్పటిలోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు? అనే అంశాలపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. దీంతో ప్రభుత్వ ప్రకటన కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

# ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

## తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు



**సంగారెడ్డి/హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, రాబోయే ఫిబ్రవరి నాటికి ఇది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశముందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఎల్‌నినో కారణంగా రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితులపై ప్రత్యక్షంగా అంచనా వేసేందుకే ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలను కాపాడుకోవడానికి అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. వరితో పాటు ఇతర పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు వ్యవసాయ, సాగునీటి, విద్యుత్ శాఖలు సమన్వయంతో రాత్రింబవళ్లు పనిచేయాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందడం లేదని, ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయి ప్రణాళికలు అమలు చేయాలన్నారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఎల్‌నినో చాలా తీవ్రమైంది!

మొదటి పేజీ తరువాయి

చూపించారు. ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నామన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి. రైతులు మనోధైర్యం కోల్పోకుండా మా ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం. కృష్ణా బేసిన్‌లో 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. 23 శాతం లోటు వర్షపాతం ఉంది. అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయి. 24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది. తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉందని గుర్తు చేశారు.

### ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

చలికాలం ఎండాకాలంలా ఉంది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై ఈ రోజు సమావేశంలో చర్చించాం. 10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి. 460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయి. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి. ఈ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పెద్ద మనసు చేసుకుని యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలని కోరారు. చుక్క చుక్కను ఆదా చేసుకోవాలి. వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి. ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం. గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలి. వానాకాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలన్నారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి.

### ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకుని, మిగిలిన రాష్ట్రాలకు తక్కువ ధరకు కేంద్రం అందించాలి. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఏం చేయమన్నా చేశాం. ఆ రోజు విధానాలు, జెండాలు మేం చూడలేదు. ఒకే విధానంలో ముందుకు వెళ్లాలన్న ప్రధాని అప్పీల్‌కు అనుగుణంగా ముందుకు వచ్చాం. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తితో వ్యవహరించాలి. అన్ని పార్టీలు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలి. ప్రభుత్వ సూచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలి. అందరి సహకారం ప్రభుత్వానికి కావాలి. మీడియా సహకారం ప్రభుత్వానికి వందకు వంద శాతం అవసరం. ప్రభుత్వం నుంచి మీడియా కోసం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తాం. టోల్ ఫ్రీ నంబర్ ఇస్తాం. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు.. అందరితో మాట్లాడి



భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అత్యంత ముఖ్యం. లేకుంటే పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం. పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకోవాలన్న కార్యాచరణను రూపొందించాం. ఎల్‌నినోను ఎదుర్కోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఈ సమస్యను ఎదుర్కోవడంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రభుత్వం నిత్యం దీనిపై అప్రమత్తంగా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరిస్తాం. ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రిని, ఇతర మంత్రులను కలుస్తాం. ప్రజలను చైతన్యపరచడానికి కళాజాతాలను ఏర్పాటు చేస్తాం. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలి. సినీ నటుడు విజయ్ దేవరకొండ ఎల్‌నినోపై ఒక విజ్ఞప్తి చేశారు. మిగిలిన సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారం తీసుకుని వారితో ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయించి అప్రమత్తం చేస్తాం. అందరి సమస్య.. అందరం కలిసి విజయవంతంగా ఎదుర్కోవాలన్నారు.

# కరువుకు కాంగ్రెస్ కారణమా?.. బీఆర్‌ఎస్‌పై రేవంత్ ధ్వజం

- విదేశాల్లోనూ ఎల్‌నినో ప్రభావం.. అక్కడ కూడా కాంగ్రెస్ ఉందా?
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టారని ఆరోపణ
- సాగునీటి, విద్యుత్ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని విమర్శ
- బహిరంగ విచారణకు సిద్ధం.. అసెంబ్లీ చర్చకు రావాలని సవాల్



**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందంటూ బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందనడం బీఆర్‌ఎస్ నేతల పైశాచిక ఆనందానికి నిదర్శనమని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాలతోపాటు బ్రిటన్, జపాన్ వంటి వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని, అక్కడ కూడా కాంగ్రెస్ పార్టీనే ఉందా అని ఆయన ప్రశ్నించారు. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతూ అబద్ధాలతో ప్రభుత్వంపై బురదజల్లి మళ్లీ అధికారంలోకి రావాలని పగటికలలు కంటున్నారని విమర్శించారు. కృష్ణా జలాల పంపిణీలో గత ప్రభుత్వం తెలంగాణ హక్కులను శాశ్వతంగా ఏపీకి తాకట్టు పెట్టిందని సీఎం ఆరోపించారు. 2015లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 515 టీఎంసీలు చాలని సంతకం పెట్టి కృష్ణా జలాల్లో తెలంగాణకు మరణశాసనం రాసింది కేసీఆర్ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టినా పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్‌ఎల్‌బీసీ, డిండి వంటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి పంచపాండవుల చెరువు ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని 400 ఎకరాలకు ప్రత్యేకంగా నీళ్లు ఎలా తీసుకువెళ్లారో ప్రజలకు తెలుసునన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో భారీ అవినీతి చోటుచేసుకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లతోపాటు, భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారని విమర్శించారు. యాదాద్రి ప్రాజెక్టు అంచనాలను ఏకంగా 110 శాతం పెంచి రూ.37,781 కోట్ల అదనపు భారం మోపారని, యూనిట్ నిర్మాణానికి రూ.9.5 కోట్లు వెచ్చించి అందులో సుమారు రూ.8,000 కోట్లు మింగేశారని ఆరోపించారు. సింగరేణిని నిండా ముంచి ఉద్దేశపూర్వకంగా విదేశాల నుంచి 'గ్రేడ్ 9' బొగ్గును దిగుమతి చేసుకునేలా కుట్ర చేశారని సీఎం విమర్శించారు. టెండర్లలో సింగరేణి పాల్గొనకుండా చేసి 14 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకునే పరిస్థితి తెచ్చారన్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ఒక ముసుగు వీరుడిని తయారు చేశారని ఆరోపించారు. ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి, నీటి వాటాలు, విదేశీ బొగ్గు దిగుమతి వ్యవహారాలపై ఏ విచారణకైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేటీఆర్ రాసిన లేఖ ఆధారంగా విచారణకు ఆదేశించడానికి తాను సిద్ధమని, అవసరమైతే ప్రజా కోర్టులో బహిరంగ విచారణ చేయిద్దామని సవాల్ విసిరారు. గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చకు రావాలని, బీఆర్‌ఎస్ చేసిన దొంగతనాలు, అవినీతిపై ఆధారాలతో నిరూపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం యాదాద్రిలో దేశీయ బొగ్గును వాడేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

### రేపటి అఖిలపక్ష సమావేశం వాయిదా

ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించాల్సి ఉన్న అఖిలపక్ష సమావేశం వాయిదా పడింది.

# భార్య ఘాతుకం!

## నిద్రలోనే భర్తపై పెట్రోల్ పోసి నిప్పు..

### వివాహేతర సంబంధం అనుమానంతో రగిలిన కుటుంబ కలహాలు

### నారాయణపేట జిల్లా మద్వార్ గ్రామంలో దారుణ ఘటన



**నారాయణపేట, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** వివాహేతర సంబంధం నేపథ్యంలో తలెత్తిన కుటుంబ కలహాలు ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొన్నాయి. భర్త మరో మహిళతో సంబంధం కొనసాగిస్తున్నాడన్న ఆగ్రహంతో నిద్రిస్తున్న అతడిపై భార్య పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తీవ్ర కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. ఈ దారుణ ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలం మద్వార్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేశారు. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం భార్యకు తెలియడంతో కుటుంబంలో విభేదాలు మొదలైనట్లు సమాచారం. ఈ విషయమై రాములమ్మ పలుమార్లు భర్తను నిలదీసినట్లు తెలిసింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సెప్టెంబర్ 24న రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను రాములమ్మ భర్తపై పోసి నిప్పంటించినట్లు ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో బాలస్వామి తీవ్ర కాలిన గాయాలకు గురయ్యాడు. అతడి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే చికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. బాలస్వామికి తీవ్ర కాలిన గాయాలు కావడంతో పరిస్థితి విషమించింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. సెప్టెంబర్ 25న చికిత్స పొందుతూ బాలస్వామి మృతి చెందాడు. దీంతో ఇద్దరు కుమారులు తండ్రిని కోల్పోయారు. ఈ ఘటన మద్వార్‌లో విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య వివరాలు వెల్లడించారు. బాలస్వామి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతడి నుంచి మరణ వాంగ్మూలం సేకరించినట్లు తెలిపారు. ఆ వాంగ్మూలంతోపాటు ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

### కుటుంబ కలహం చివరకు ప్రాణాంతకం

వివాహేతర సంబంధం నేపథ్యంలో మొదలైన భార్యాభర్తల మధ్య విభేదాలు చివరకు హత్య కేసుగా మారడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కుటుంబంలో నెలకొన్న వివాదం ఇద్దరు కుమారులు తండ్రిని కోల్పోయే పరిస్థితికి దారితీసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, సాక్ష్యాధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసులో తదుపరి చట్టపరమైన చర్యలు దర్యాప్తు ఆధారంగా చేపట్టనున్నారు.

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా!

- రేవంత్ సర్కారుపై కేటీఆర్ సంచలన అవినీతి ఆరోపణలు
- ప్రతి ప్రాజెక్టులో కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని విమర్శ
- నిర్మాణ సంస్థ ఎండీ రాసినట్లు చెబుతున్న లేఖ విడుదల
- రేడియల్ రోడ్డు టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణ



**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో ముఖ్యమంత్రి కార్యాలయం ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కమీషన్ల వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపుల నుంచి కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల వరకు అవినీతి చోటుచేసుకుంటోందని ఆరోపించారు. తన ఆరోపణలకు ఆధారంగా ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అక్టోబర్ 13న రాసినట్లు పేర్కొంటున్న లేఖను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల్లో ముఖ్యమంత్రి కార్యాలయం 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు చెల్లించకుండా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ప్రజాధనంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ వ్యవస్థను మార్చేశారని ఆరోపించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని రేడియల్ రోడ్డు--2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పాల్గొన్న అర్హత కలిగిన నిర్మాణ సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా సుశీ ఇన్‌ఫ్రా వంటి సంస్థలను పక్కనపెట్టి ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టెండర్ల కేటాయింపుల్లో పారదర్శకత లోపించిందని పేర్కొన్నారు. ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న లేఖను కేటీఆర్ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఈ లేఖలో పేర్కొన్న అంశాలు ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్వహణ, టెండర్ల ప్రక్రియపై అనుమానాలు కలిగిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కాంట్రాక్టుల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న తన ఆరోపణలకు ఈ లేఖ బలం చేకూరుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంలోనూ కమీషన్ల వ్యవహారం నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల కారణంగా అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సి ఉండగా కమీషన్ల వ్యవహారాల చుట్టూ తిరుగుతున్నాయని ఆరోపించారు. రైతుల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలకు కేంద్రంగా మారిందని కేటీఆర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కంటే ప్రభుత్వ పెద్దల వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన ప్రజాధనం దుర్వినియోగమవుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కార్యాలయంపై కేటీఆర్ చేసిన 15 శాతం కమీషన్ ఆరోపణలు, రేడియల్ రోడ్డు టెండర్లలో అక్రమాలు జరిగాయన్న విమర్శలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే కేటీఆర్ విడుదల చేసినట్లు పేర్కొన్న లేఖలోని అంశాలు, అవినీతి ఆరోపణలు స్వతంత్ర విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థల స్పందన తెలియాల్సి ఉంది.

# 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

- ప్రభుత్వాన్ని నిలదీసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- 66.33 లక్షల ఎకరాలు ఉండాల్సి ఉండగా 42.53 లక్షల ఎకరాలే ఉన్నాయా?
- ప్రభుత్వ, పేదల భూములపై పెద్దలకన్ను పడిందని తీవ్ర ఆరోపణలు
- అసైన్డ్ భూముల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శ
- ధరణి పోయి భూభారతి వచ్చినా అక్రమాలు ఆగలేదని ధ్వజం
- బీఆర్ఎస్ అవినీతిపై సీబీఐ విచారణకు ఎందుకు వెనుకడుగు?



**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో కనిపించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొనడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ రెండు గణాంకాల మధ్య దాదాపు 23.80 లక్షల ఎకరాల వ్యత్యాసం ఉందని, అంత భారీ విస్తీర్ణంలో భూమి ఏమైందో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములు పెద్దఎత్తున అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భూములకు సంబంధించిన గణాంకాలను దృశ్యరూప ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణలో అటవీ భూముల విస్తీర్ణానికి సంబంధించిన ప్రభుత్వ గణాంకాల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు అధికారిక రికార్డుల్లో 66.33 లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు చూపుతుండగా, మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. దాదాపు 24 లక్షల ఎకరాల భూమి లెక్కల్లో ఎందుకు కనిపించడం లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు, పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. భూములను కాపాడాల్సిన వ్యవస్థలే అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నాయని విమర్శించారు. కొందరు ప్రముఖ రాజకీయ నాయకులు ప్రభుత్వ, పేదల భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల జీవనోపాధి కోసం కేటాయించిన అసైన్డ్ భూముల విక్రయానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి భూముల విషయంలో అన్యాయం చేసే నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. అసైన్డ్ భూములపై ప్రభుత్వ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేదలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌పై అప్పట్లో కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసిందని మహేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి పేరుతో కొత్త వ్యవస్థను తీసుకొచ్చినా భూ రికార్డుల్లో అక్రమాలు మాత్రం కొనసాగుతున్నాయని ఆరోపించారు. పేరు మార్చినంత మాత్రాన భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావని వ్యాఖ్యానించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, ప్రభుత్వ భూముల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 22ఏ నిబంధన అమలుపైనా మహేశ్వర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో న్యాయస్థానం ఈ నిబంధనపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం కొన్ని సవరణలతో కొనసాగిస్తోందని ఆరోపించారు. భూ రికార్డులు, నిషేధిత ఆస్తుల జాబితాల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను పరిరక్షించేలా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూములకు సంబంధించిన భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకులు గతంలో ఆరోపించారని మహేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఆరోపణలపై సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు విచారణ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూముల వ్యవహారంలో గత, ప్రస్తుత ప్రభుత్వాల తీరుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

# యాదాద్రి ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు

- నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు
- ప్లాంట్ పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను సస్పెండ్ చేసింది. మరోవైపు నిర్మాణ పనులను వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ఐదుగురు ఐఏఎస్ అధికారులను క్యాంప్ ఆఫీసర్లుగా నియమించింది. పనుల పురోగతి, నాణ్యత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని ప్రభుత్వం సమీక్షించింది. నిర్మాణంలో జాప్యం, పనుల నిర్వహణలో లోపాలపై దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్టోబర్ 14న సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరు ప్లాంట్ ప్రాంగణంలోనే ఉంటూ సివిల్ పనులు, బొగ్గు సరఫరా మార్గాలు, విద్యుత్ తరలింపు కోసం గ్రిడ్ అనుసంధానం, కాంట్రాక్టు సంస్థల పనితీరును నిరంతరం సమీక్షించనున్నారు. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ పెరగడం, సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ప్లాంట్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో ఉత్పత్తిని ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులకు బాధ్యతలు అప్పగించింది. వేసవిలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, టీజీఈఆర్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థలు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిస్కంలకు నిధుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటూనే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించారు. యాదాద్రి ప్లాంట్ పనుల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించడం, నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ చర్యలు ప్లాంట్ నిర్మాణాన్ని ఎంతవరకు వేగవంతం చేస్తాయి, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎంతమేరకు దోహదపడతాయన్నది కీలకంగా మారింది.




# కూకట్‌పల్లి నాలాపై హైడ్రా ఫోకస్

## ఆక్రమణలు తొలగించి విస్తరించాలని రంగనాథ్ ఆదేశం!

**హైదరాబాద్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ నగర పరిధిలోని హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరద, మురుగునీటిని మోసుకొచ్చే కీలకమైన కూకట్‌పల్లి నాలాపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రత్యేక దృష్టి సారించింది. నాలా పరివాహక ప్రాంతాలైన ఫతేనగర్–బాలానగర్ పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో ఎదురవుతున్న వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు నాలా ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియలో పేదల నివాసాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంగా ఆదేశించారు. గురువారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో సీఎంసీ, ఎంఎంసీ, పారిశ్రామిక వాడ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు, ఇలా అధికారులతో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫతేనగర్ ప్రాంతంలో సుమారు 40 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా, ఆక్రమణల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కేవలం 9 మీటర్లకు కుంచించుకుపోయిందని అధికారులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. సికింద్రాబాద్ ప్యాట్నీ నాలా విస్తరణ తరహాలోనే ఫతేనగర్ వద్ద కూడా పరికిచెరువు, ఐడీఎల్ చెరువుల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా నిరోధక చర్యలు చేపట్టాలని సూచించారు. అర్ధగంట వర్షం కురిసినా పారిశ్రామిక ప్రాంతాలు జలమయమవుతున్నాయని పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేయగా, నాలా విస్తరణ పనులకు తాము పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ నాలా హద్దులు గుర్తించి, ఆక్రమణల తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులకు మార్గదర్శనం చేశారు.

# 2.50 లక్షల లంచం

## ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్!

### భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు రూ.5 లక్షల డిమాండ్

### డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు పట్టివేత

### వీఆర్ఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ అదుపులోకి



**కీసర, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు చిక్కారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న వ్యవసాయ భూమిని తొలగించేందుకు బాధితుడి నుంచి తొలి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండల డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితోపాటు ఆయనకు సహకరించిన వీఆర్ఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కీసర మండలానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి నిషేధిత ఆస్తుల జాబితాలోని 22ఏ కింద నమోదైంది. దీంతో తన భూమిని ఆ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ బాధితుడు కీసర తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. సమస్య పరిష్కారం కోసం చాలాకాలంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. తహసీల్దార్‌తోపాటు డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి తన సమస్యను వివరించి పరిష్కరించాలని కోరాడు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటే రూ.5 లక్షల లంచం ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అంత పెద్ద మొత్తాన్ని ఒకేసారి చెల్లించే స్థోమత లేదని బాధితుడు చెప్పడంతో విడతలవారీగా డబ్బులు ఇచ్చేలా మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో తొలి విడతగా రూ.2.50 లక్షలు చెల్లించేందుకు నిర్ణయించిన బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. జరిగిన విషయాన్ని వారికి వివరించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం వల పన్నారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు తొలి విడతగా రూ.2.50 లక్షలు అందజేస్తున్న సమయంలో ఏసీబీ బృందం ఆకస్మికంగా దాడి చేసింది. లంచం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఆయనకు సహకరించిన వీఆర్ఏ విజయ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. కీసర మండలానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. బాధితుడు పలుమార్లు కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్ రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందిందని వివరించారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు ఆయనకు సహకరించిన విజయ్‌కుమార్, బాలకృష్ణలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



## సంపాదకీయం



# భారత్‌లో వేగంగా పెరుగుతున్న వృద్ధుల జనాభా

**2050 నాటికి 20 శాతం దాటనున్న 60 ఏళ్లు పైబడినవారు**

**పదవీ విరమణ తర్వాత కూడా ఉపాధి కోసం పెరుగుతున్న ఆసక్తి**

**ఉద్యోగాల కోసం నమోదైన 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు**

**అనుభవజ్ఞుల కోసం కొత్త అవకాశాలు కల్పిస్తున్న సంస్థలు**

**వయసు కాదు.. నైపుణ్యమే ప్రామాణికం కావాలంటున్న నిపుణులు**

పదవీ విరమణ అంటే ఉద్యోగ జీవితానికి ముగింపు అనే భావన క్రమంగా మారుతోంది. అరవై ఏళ్లు దాటినా పనిచేయాలనే ఉత్సాహం, అనుభవాన్ని ఉపయోగించుకోవాలనే తపన భారతీయుల్లో పెరుగుతోంది. మరోవైపు దేశంలో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతుండటంతో ఉద్యోగ రంగంలోనూ కొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. ఒకప్పుడు పదవీ విరమణ చేసినవారిని ఉద్యోగాలకు దూరంగా ఉంచిన సంస్థలు ఇప్పుడు వారి అనుభవం, నైపుణ్యాన్ని ఉపయోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా సలహాదారులు, మార్గదర్శకులు, ప్రాజెక్టు నిపుణులుగా సీనియర్ సిటిజన్లకు అవకాశాలు కల్పించే ధోరణి కనిపిస్తోంది. వయసు ఆధారంగా కాకుండా సామర్థ్యాన్ని బట్టి ఉద్యోగాలు కల్పించాలన్న అభిప్రాయం బలపడుతోంది.

### 2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే!

ఐక్యరాజ్యసమితి జనాభా నిధి విడుదల చేసిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం దేశంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య గణనీయంగా పెరగనుంది. 2022లో మొత్తం జనాభాలో 10.5 శాతంగా ఉన్న వృద్ధుల వాటా 2050 నాటికి 20 శాతానికి పైగా చేరుతుందని అంచనా. అంటే అప్పటికి దేశ జనాభాలో ప్రతి ఐదుగురిలో ఒకరు 60 ఏళ్లు పైబడినవారే ఉండే అవకాశం ఉంది. ఈ మార్పు ఆరోగ్య సంరక్షణ, పెన్షన్లు, సామాజిక భద్రతతోపాటు ఉపాధి రంగంపైనా ప్రభావం చూపనుంది. సంప్రదాయ పదవీ విరమణ విధానాలను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

### ఉద్యోగాల కోసం 1.89 లక్షల మంది నమోదు

పదవీ విరమణ తర్వాత కూడా పనిచేయాలనే ఆసక్తి సీనియర్ సిటిజన్లలో కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో వృద్ధులకు అనువైనవిగా పేర్కొన్న సుమారు 1.68 లక్షల ఉద్యోగ ఖాళీలు నమోదైనట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు దాదాపు 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉద్యోగాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సంఖ్యలు వృద్ధుల్లో ఉపాధిపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తున్నాయి. అయితే నమోదైన ఖాళీలన్నీ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయా, ఎంతమందికి ఉద్యోగాలు లభించాయనే వివరాలపై మరింత స్పష్టత అవసరం. ప్రభుత్వ ఉద్యోగ వేదికలతోపాటు ప్రైవేటు సంస్థలు కూడా సీనియర్ సిటిజన్లకు అవకాశాలు కల్పిస్తున్నాయి. 'విజ్డమ్‌సర్కిల్' వంటి వేదికలు పదవీ విరమణ చేసిన నిపుణులను కంపెనీలతో అనుసంధానిస్తున్నాయి. సలహాదారులుగా, యువ ఉద్యోగులకు మార్గదర్శకులుగా, ప్రాజెక్టుల నిర్వహణలో నిపుణులుగా వారి సేవలను వినియోగించుకుంటున్నాయి. పూర్తిస్థాయి ఉద్యోగాలకే పరిమితం కాకుండా అనువైన పనివేళలు, తాత్కాలిక ప్రాజెక్టులు, ఇంటి నుంచి పనిచేసే అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ముంబైకి చెందిన ఓ అంకుర సంస్థలో 64 ఏళ్ల వ్యక్తి ఇంటర్న్‌గా చేరిన ఉదంతం వయసుతో సంబంధం లేకుండా కొత్త విషయాలను నేర్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయని చాటుతోంది.

### నియామకాలకు వయసే అడ్డంకా?

వృద్ధులకు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు కొనసాగుతున్నాయి. వయసు పెరిగినవారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి త్వరగా అలవాటుపడలేరని, ఎక్కువ వేతనాలు ఆశిస్తారనే అభిప్రాయాలు కొన్ని సంస్థల్లో కనిపిస్తున్నాయి. అయితే అనుభవజ్ఞులైన ఉద్యోగులకు సంస్థాగత వ్యవహారాలపై అవగాహన, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, వృత్తిపరమైన పరిచయాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. యువతలోని సాంకేతిక నైపుణ్యాలకు సీనియర్ల అనుభవం తోడైతే సంస్థలకు ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

### ఆర్థిక వ్యవస్థకూ ప్రయోజనమే!

పదవీ విరమణ తర్వాత పనిచేయాలనుకునే వారికి తగిన అవకాశాలు కల్పించడం వల్ల కుటుంబాల ఆర్థిక భద్రత మెరుగుపడే అవకాశం ఉంది. వృద్ధులు ఆర్థికంగా స్వతంత్రంగా జీవించేందుకు ఉపాధి దోహదపడుతుంది. అనుభవజ్ఞుల సేవలను వినియోగించుకోవడం ద్వారా సంస్థల్లో నైపుణ్యాల కొరతను కొంతవరకు అధిగమించవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే అందరికీ పదవీ విరమణ తర్వాత పనిచేసే ఆరోగ్య పరిస్థితులు, అవకాశాలు ఒకేలా ఉండవని, ఉద్యోగాలు స్వచ్ఛందంగా ఎంచుకునే విధంగా ఉండాలని సూచిస్తున్నారు.

### వయసు కాదు.. సామర్థ్యమే కొలమానం

వృద్ధుల జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగ విధానాల్లో మార్పులు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిరంతర నైపుణ్యాభివృద్ధి, దశలవారీ పదవీ విరమణ, అనువైన పనివేళలు, యువతతో కలిసి పనిచేసే బృందాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. వయసు కారణంగా అర్హులైన వ్యక్తులను ఉద్యోగాలకు దూరం చేయకుండా, వారి ఆరోగ్యం, ఆసక్తి, అనుభవం, సామర్థ్యం ఆధారంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. మారుతున్న జనాభా పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి వ్యవస్థను తీర్చిదిద్దడమే భవిష్యత్తులో కీలక సవాలుగా మారనుంది.

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు!

- న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు ఫలించవు
- ఇండియా కూటమి నిరసనలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సుప్రీంకోర్టులో విచారణ
- ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం
- రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లకు నోటీసులంటూ కథనం
- అక్టోబర్ 12 నాటి సీసీ కెమెరాల దృశ్యాల భద్రతపై ఆదేశాల ప్రస్తావన





**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని తేల్చిచెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### న్యాయస్థానంపై ఒత్తిడి సరికాదు..

విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శన ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న వాదనపై స్పందిస్తూ.. అవన్నీ బలహీనమైన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. బయట రాజకీయ నాయకులు చేసే ప్రకటనలను తాము గమనిస్తూనే ఉన్నామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలియకుండా తాము లేమని వ్యాఖ్యానించారు.

### రాహుల్ గాంధీ, అఖిలేశ్‌కు నోటీసులు..

సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఇతర నేతలకు నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 12న ఇండియా కూటమి చేపట్టిన నిరసన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో రికార్డైన సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. కాగా, సోమవారం నాడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు.

### ఎన్నికల సంఘం నిర్ణయాలపై ఇండియా కూటమి పిటిషన్..

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, సీపీఎం నేత ఎం.ఏ.బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఎస్ఐఆర్ నిర్ణయాల రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమ అభ్యంతరాలను పరిష్కరించడంతోపాటు స్వతంత్ర కమిటీతో ఆడిట్ నిర్వహించాలని కోరారు. మొత్తం పది ప్రధాన డిమాండ్లను పిటిషన్‌లో ప్రస్తావించారు.

# జంతర్ మంతర్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!

- నిరసన స్థలాల జాబితా నుంచి తొలగింపుపై విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు
- శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు విఘాతమంటూ పిటిషన్
- కమిటీ నివేదిక ఆధారంగానే నిర్ణయమన్న కేంద్రం
- సమాధానాలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:** దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ప్రదర్శనలకు ప్రసిద్ధి చెందిన జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వంతోపాటు ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. జంతర్ మంతర్‌ను నిరసన ప్రదర్శనల కోసం వినియోగించకుండా ఆంక్షలు విధించడాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు ప్రాధాన్యం ఉందని, నిరసన స్థలాన్ని తొలగించడం వల్ల ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కష్టమవుతుందని వాదించారు. ఈ అంశంపై కేంద్రం, ఢిల్లీ పోలీసుల వివరణను పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొన్నట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేశారు. ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాలను కేటాయించినప్పటికీ ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు జంతర్ మంతర్ అనువైన ప్రాంతమని వాదించారు. ప్రజల గొంతును ప్రభుత్వానికి వినిపించే అవకాశాలను పరిమితం చేయడం శాంతియుత నిరసన హక్కుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని న్యాయస్థానాన్ని కోరారు. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా తొలగించే ముందు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ పరిశీలన అనంతరమే నిర్ణయం తీసుకున్నామని ధర్మాసనానికి వివరించినట్లు సమాచారం. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను కేంద్రం తరఫున కోర్టుకు తెలియజేశారు. అయితే పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ అంశాన్ని మరింత పరిశీలించాల్సి ఉందని న్యాయస్థానం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

### కేంద్రం సమాధానాలపైనే తదుపరి నిర్ణయం

జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి



తొలగించడానికి గల కారణాలను కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు వివరించాల్సి ఉంది. వారి సమాధానాలను పరిశీలించిన అనంతరం చట్టప్రకారం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో కేంద్రం, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సమర్పించే వివరణలు ఈ కేసులో కీలకంగా మారనున్నాయి. శాంతియుత నిరసన తెలిపే హక్కు, ప్రజా భద్రత, పరిపాలనాపరమైన నిర్ణయాల మధ్య సమతుల్యతకు సంబంధించిన అంశాలు ఈ విచారణలో ప్రధానంగా నిలవనున్నాయి.

# నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు షాక్..

## 28లోగా దేశం విడిచి వెళ్లాలని ముంబై పోలీసుల ఆదేశం





- భారత పౌరుడు కాకపోయినా నిరసనలో పాల్గొన్నందుకు చర్యలు
- ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఇమ్రాన్
- ఆయన అమెరికా పౌరుడని, ఓసీఐ కార్డు హోల్డర్ అని సమాచారం

**ముంబై:** బాలీవుడ్ ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. అక్టోబర్ 28లోగా భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. భారత పౌరుడు కానప్పటికీ రాజకీయ నిరసనలో పాల్గొన్నందుకే ఆయనపై ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 10న ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదానంలో 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ ఆందోళనలో ఇమ్రాన్ ఖాన్ తన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జేన్ మేరీ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఆ సమయంలో పోలీసులు ఇమ్రాన్‌తో సహా సుమారు 400 మందిని అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత విడుదల చేశారు. అయితే, ఇమ్రాన్ ఖాన్ భారత పౌరుడు కాదని, ఆయన అమెరికా పౌరసత్వంతో 'ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా' (ఓసీఐ) కార్డును కలిగి ఉన్నారని పోలీసులు గుర్తించారు. "భారత పౌరుడు కానప్పటికీ నిరసనలో పాల్గొన్నందున ఇమ్మిగ్రేషన్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఇమ్రాన్ ఖాన్‌పై చర్యలు తీసుకున్నాం" అని ముంబై పోలీసులు తమ నోటీసులో పేర్కొన్నారు. అరెస్ట్ సమయంలో ఇమ్రాన్ ఖాన్ పోలీస్ వ్యాన్ నుంచి "నేను డ్రైవ్‌కు వెళ్తున్నట్లున్నాను" అని క్యాప్షన్ పెట్టి ఫొటో పోస్ట్ చేశారు. అలాగే, పోలీసులతో 'జై హింద్' అని చెబుతున్న వీడియో కూడా వైరల్ అయింది. తనను ఎందుకు అదుపులోకి తీసుకున్నారో తెలియదని, సుమారు రెండు గంటల పాటు వ్యాన్‌లో తిప్పి వదిలేశారని ఆయన చెప్పిన మాటలు కూడా అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ నిరసనలో తుషార్ గాంధీ నేతృత్వంలోని 'హమ్ భారత్ కే లోగ్', సీపీఐ(ఎం) కార్యకర్తలు కూడా పాల్గొని అదుపులోకి గురయ్యారు. తాజా పోలీసు నోటీసులతో ఇమ్రాన్ ఖాన్ వ్యవహారం బాలీవుడ్‌లో కలకలం రేపుతోంది.



# శాంతి, మానవత్వమే ఇస్లాం ప్రధాన సందేశం

## హజరత్ అహ్మద్ నక్ష్ బంది



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జామా మస్జిద్ వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన జల్సా ఏ గౌస్ ఇ అజమ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హజరత్ అహ్మద్ నక్ష్ బంది హాజరై ప్రసంగించారు. ఇస్లాం శాంతి సందేశం ఇస్తుందని, మొహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అంతకముందు జమే దార్ బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సభ అనంతరం జామ మస్జిద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, గౌస్ ఉల్ వరా కమిటీ అధ్యక్షుడు షేక్ షాకీర్ పలువురు ఆయనకు సన్మానించారు. అలాగే ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ నివాసంలో హజరత్ అహ్మద్ నక్ష్ బంది కి పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాగ్రూబ్ రజా, జాఫర్ సాదిక్ హుస్సేన్, నిర్వాహకులు షేక్ షబ్బీర్, హకీమ్ అన్సారీ, సయ్యద్ జావిద్, సాలం బీన్ హసన్, ఎండి సాజిద్, అబ్దుల్ సలాం, చోటన్, అమర్ బీన్ హసన్, ముబాషీర్ , ఎండి తాజ్, ఇమ్రాన్, అహ్మద్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# కలాం ఆశయాలు స్ఫూర్తిదాయకం

## మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ : మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ భారతదేశ సాంకేతిక, రక్షణ రంగాల అభివృద్ధికి అబ్దుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బీన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు సయ్యద్ అన్సార్, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, మోహన్ గౌడ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ ■ సిసి రోడ్డు, డ్రైనేజీ పనుల పరిశీలన

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు పొట్టి శ్రీరాములు చౌక్ సమీపంలో జరుగుతున్న సిసి డ్రైనేజ్ , రోడ్డు నిర్మాణ పనులను గురువారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో నాణ్యత లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బీన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్, దూడల అశోక్, జయరాజ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడిని ఖండించిన తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు పొత్తూరు శేఖర్, సంపత్‌ను తెలంగా ణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్‌తో పాటు ఫోరం నాయకులు పరామర్శించారు. గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ కరీంనగర్ నుంచి శేఖర్, సంపత్‌లను తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. కోర్టులో హాజరుపరిచిన సమయంలో వారి గాయాలను గమనించిన న్యాయమూర్తి స్టేట్‌మెంట్ నమోదు చేసుకుని రిమాండ్‌ను తిరస్కరించి ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతం వీరు కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన ఫోరం నాయకులు ఎస్సైని విధుల నుంచి తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరామర్శలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లేపాక రాజేష్, రాష్ట్ర గౌరవ సలహాదారులు సుంచు లింగయ్య, ప్రేమ్ కుమార్, రాష్ట్ర కోశాధికారి బొట్ల సదానందం, రాష్ట్ర సహాయ కార్యదర్శి అనిల్, కొట్టేపల్లి గంగరాజు, జిల్లా ఇన్‌చార్జి లంక స్వామి, కే. ఎల్లయ్య, జింక శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై దాడులు చేయడం అంటే ప్రజాస్వామ్యంపై దాడులే

## తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన విలేకరులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లు ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ ఆదేశాల మేరకు తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి బాధిత జర్నలిస్టులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రభుత్వం తేలికగా తీసుకోకూడదు. బాధితులకు న్యాయం జరిగే వరకు జర్నలిస్టులకు అండగా టిఆర్ఎస్ ఉంటుందని జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, విధి నిర్వహణలో భాగంగా ప్రశ్నలు అడిగే లేదా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులను వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, వేధింపులకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్, మ్యాకల తిరుపతి, బసవేణి రాజేందర్, మడిపల్లి వినీత్, చిట్టంపల్లి నాగరాజు, పల్లె శారద, కొత్తూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వద్దు.. ఆటలే ముద్దు



## అదనపు ఏఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్

## 'చైతన్యం-డ్రగ్స్‌పై యుద్ధం'లో భాగంగా వాలీబాల్ పోటీలు

## విజేతలకు బహుమతులు ప్రదానం

**ఉద్యమ కెరటం, జైనూర్:** యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలపై దృష్టి సారించాలని అదనపు ఏఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు, డీఎస్పీ అశోక్ కుమార్ మార్గదర్శకత్వంలో, సీఐ రమేష్ ఆధ్వర్యంలో "చైతన్యం -- డ్రగ్స్‌పై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా జైనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన ఆసిఫాబాద్ సబ్ డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి మండలాల నుండి 65 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో దేవుగూడ జట్టు ప్రథమ స్థానం, రాసిమెట్ట జట్టు ద్వితీయ స్థానం, శివనూరు జట్టు తృతీయ స్థానం సాధించాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గంజాయి, గుట్కా మరియు మాదకద్రవ్యాల వినియోగం కుటుంబాలకు, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ శారీరక, మానసిక దృఢత్వాన్ని ఇచ్చే క్రీడల్లో రాణించి "నషా ముక్త భారత్" నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైనూర్ ఎస్సై రవి కుమార్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండలాల సర్పంచులు, సార్‌మెడీలు, క్రీడాకారులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఆధునిక సాంకేతికతతోనే రైతులకు లాభాలు

- శాసనసభ్యులతో కలిసి కిసాన్ మేళాను ప్రారంభించిన కలెక్టర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపు నిచ్చారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమల గార్డెన్స్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కిసాన్ మేళా'ను ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాళ్లను సందర్శించి యంత్రాలు, నూతన వంగడాలు, విత్తనాల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పంటల వైవిధ్యీకరణలో భాగంగా వరి సాగు విస్తీర్ణాన్ని 25 శాతం వరకు తగ్గించగలిగామని తెలిపారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని, నీటి పొదుపు పద్ధతులను పాటించడం వల్ల సాగు ఖర్చులు తగ్గి స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యంత్రాల వినియోగం ద్వారా సమయం, శ్రమతో పాటు పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం తగ్గడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గాయని, రాబోయే నెలల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# మేమున్నామంటూ.. మిత్రుడి కుటుంబానికి భరోసా

- గుండి గ్రామంలో మానవత్వం చాటుకున్న చిన్ననాటి మిత్రులు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** చిన్ననాటి స్నేహబంధానికి కులమతాలు, ప్రాంతాలు లేవని, ఆపదలో ఉన్నప్పుడే నిజమైన స్నేహం బయటపడుతుందని గుండి గ్రామానికి చెందిన యువకులు మరోసారి నిరూపించారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన గుండి గ్రామానికి చెందిన సాయికుమార్ కుటుంబానికి ఆయన చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు.సాయి కుమార్ అకాల మరణంతో శోకసంద్రంలో మునిగిపోయిన ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు మిత్రులు ముందుకు వచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ. 30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కేవలం ఆర్థిక సహాయంతో సరిపెట్టకుండా, "ఈ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ కొడుకుల్లాగే ఉంటామని, ప్రతి విషయంలోనూ అండగా నిలబడి భరోసా ఇస్తామని" మిత్రులు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచిన మిత్రుల గొప్ప మనసును గ్రామస్తులు, స్థానికులు ఎంతో అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పోల్కర్



సాయిరామ్, శ్రీకాంత్, మోహిత్, పున్నం, శ్యామ్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ హెడ్క్వార్టర్స్‌లో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం ప్రత్యేక ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీస్ సిబ్బంది తమ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక



శ్రద్ధ చూపాలని సూచించారు. కంటి చూపు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యుల సలహా మేరకు చికిత్స పొందడం ద్వారా సమస్యలు తీవ్రం కాకుండా నివారించవచ్చని తెలిపారు. వైద్య శిబిరంలో వైద్యులు పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు అందించారు. కంటి చూపు సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు తదుపరి చికిత్స పొందాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం శాఖ తరఫున అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, డాక్టర్ పాశం మహేష్, ఆర్ఐలు కామరాజు, సురేష్, శ్రీశైలం, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# పువ్వుల సాగుతో రైతులకు సిరుల పంట

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో రైతులు ఆర్థికంగా బలపడాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించేందుకు పువ్వుల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మావల మండలం బట్టిసావర్గం శివారులో రైతు బొమ్మల స్వామికి చెందిన పువ్వుల తోటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులో కొప్పుల కిరణ్ కు చెందిన పువ్వుల తోట, టమాటా పంటలను బైక్ పై ప్రయాణించి పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కల్టివేషన్ తీరును తిలకించి రైతులను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో చేపట్టిన ఈ పువ్వుల సాగు అభినందనీయమని కొనియాడారు. ఎల్ నినో సమయంలో పంట మార్పిడి విధానంపై జూన్, జూలై మాసాల్లో గ్రామసభల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ తోటలో ఎలాంటి పంట నష్టాలు లేకుండా మంచి దిగుబడి రావడమే కాకుండా, అయోధ్య నుంచి వచ్చిన ప్రత్యేక ఆర్డర్ల మేరకు అక్కడికి ఫార్వర్డ్ లింకేజీ ద్వారా పువ్వులు ఎగుమతి అవుతుండటం విశేషమన్నారు. ఒక ఎకరంలో పువ్వుల సాగుకు కేవలం రూ.35 నుంచి రూ.40వేల వరకు ఖర్చు అవుతుందని, మార్కెట్లో విక్రయిస్తే దాదాపు 5 టన్నుల వరకు దిగుబడి వచ్చి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ నీటి వినియోగం కోసం స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ ఎండల తీవ్రత దృష్ట్యా, సోయాబీన్ హార్వెస్ట్ పూర్తయిన తర్వాత రైతులు వేరుశనగ, మినుము, నువ్వులు వంటి తక్కువ నీరు అవసరమయ్యే స్వల్పకాలిక పంటల వైపు మళ్లాలని సూచించారు. పత్తి తీసిన వెంటనే మళ్లీ జొన్న, పత్తి భూమిలో అదే పద్ధతి కొనసాగిస్తే మార్చి, ఏప్రిల్ వరకు



ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రత్యామ్నాయ స్వల్పకాలిక పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సందీప్, తలమడుగు తహశీల్దార్ రాజ్ మోహన్, కజ్జర్ల, బట్టిసావర్గం సర్పంచులు నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల ఉద్యానవన అధికారి క్రాంతి, అధికారులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. కాగజ్నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 98 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాగజ్నగర్ పట్టణం, మండలానికి చెందిన 82 మంది లబ్ధిదారులతో పాటు సిర్పూర్ మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల వివాహ సమయంలో కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తాన, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, తహశీల్దార్ మల్లెపూల మధుకర్, కౌన్సిలర్లు జ్యోతి, అల్లాడి రాజు, ముబీన్, సర్పంచులు రాచర్ల రజినీ మహేష్, చంకాపురి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గురువారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల శ్రమను గుర్తించి, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందించడం వారి హక్కు అని, జీతాల చెల్లింపులో జాప్యం కారణంగా వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని అధికారులను కోరారు. మున్సిపల్ కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి తమ మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నిరుపేదల వైద్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- కౌఠ(బి)లో కుటుంబానికి రూ.24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ఉద్యమ కెరటం, బోథ్:** నిరుపేదల ఆరోగ్య భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ ఆదేశాల మేరకు గురువారం కౌఠ(బి) గ్రామానికి చెందిన మల్లెపూల సునీల్ కుటుంబానికి రూ.24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. నాయకులు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సునీల్ ఆర్థిక పరిస్థితిని గుర్తించిన ఆడే గజేందర్ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఆడే గజేందర్ నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ చూపుతున్నారని అన్నారు. ప్రజలకు కష్టాలు ఎదురైనప్పుడు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. సకాలంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఆడే గజేందర్కు లబ్ధిదారుడు సునీల్తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీ కమిటీ సభ్యుడు ఇట్టేడి రాజు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సున్నపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఇట్టేడి రవి రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చిలకాడి రవి, యాల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించి, ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాలని లెప్రసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి జయనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ సూచించారు. గురువారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈనెల 22 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న లెప్రసీ సర్వే కార్యాచరణ ప్రణాళికను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 14 రోజుల పాటు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించేలా చైతన్యపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఝాన్సీరాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు జయమేరి, పుట్ట సత్తయ్య, నాందేవ్, సూపర్వైజర్లు తారాబాయి, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# కోహ్లీకి సత్య నాదెళ్ల స్వాగతం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రముఖ వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ వేదిక లింక్డిన్‌లో అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. కోహ్లీ తొలి పోస్టుపై స్పందించిన నాదెళ్ల.. ఆయన కొత్త వ్యాపార ప్రయాణానికి అభినందనలు తెలిపారు. కోహ్లీ లింక్డిన్‌లోకి రావడంతో తన ఫీడ్ మరింత ఆసక్తికరంగా మారిందని పేర్కొన్నారు. లింక్డిన్‌లో తన తొలి పోస్టు ద్వారా కోహ్లీ భారత క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావాలన్న ఆకాంక్షను వెల్లడించాడు. దేశంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలకూ ఆదరణ పెరగాలని, భారతీయ బ్రాండ్లు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యంతోనే వ్యాపార రంగంలోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపాడు. కోహ్లీ 'అగిలిటాస్ స్పోర్ట్స్'లో పెట్టుబడిదారుడిగా, 'వన్8వరల్డ్'లో సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నాడు. క్రీడలతో తనకున్న అనుబంధాన్ని వ్యాపార రంగంలోనూ విస్తరించుకుంటూ భారతీయ క్రీడా సంస్కృతికి, దేశీయ బ్రాండ్లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు. నాదెళ్ల నుంచి వచ్చిన అభినందనలు ఈ కొత్త ప్రయాణానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. లింక్డిన్‌లో కోహ్లీ ప్రవేశానికి అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. ఖాతా ప్రారంభించిన తొలి 24 గంటల్లోనే ఆయన అనుచరుల సంఖ్య 2.4 లక్షలు దాటినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. మైదానంలో తన బ్యాటింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న కోహ్లీ.. ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తన ఆలోచనలు, లక్ష్యాలను పంచుకుంటూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు.

# ఆసియా పతక విజేతలతో మోదీ భేటీ

- 85 పతకాలతో భారత్ సత్తా.. విజేతలకు ప్రధాని అభినందనలు
- మహిళా అథ్లెట్ల ఖాతాలో 38 పతకాలు.. 11 స్వర్ణాలు
- 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం
- కొత్త ఛాంపియన్లు, రికార్డులే లక్ష్యంగా క్రీడాకారులకు పిలుపు




న్యూఢిల్లీ, అక్టోబర్ 15: అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత యువత తమ ప్రతిభను చాటుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో గురువారం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఆయన సమావేశమయ్యారు. దేశానికి గౌరవం తీసుకొచ్చిన విజేతలను అభినందించారు. ఈసారి భారత్ మొత్తం 85 పతకాలు సాధించిందని, ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విజయాలు దేశంలో మారుతున్న క్రీడా సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల విజయాల వెనుక వారి కఠోర శ్రమతో పాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఉందని మోదీ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ ఆయనకు నివాళులర్పించారు.

## మహిళా అథ్లెట్ల ప్రతిభకు ప్రశంసలు

ఆసియా క్రీడల్లో భారత మహిళా క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మొత్తం 85 పతకాల్లో మహిళా అథ్లెట్లు 38 పతకాలు సాధించారని, వాటిలో 11 స్వర్ణాలు ఉన్నాయని తెలిపారు. పతకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, దేశ సామర్థ్యాన్ని చాటిచెప్పే విజయాలని పేర్కొన్నారు. గతంలో పెద్దగా పతకాలు సాధించని మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లోనూ భారత అథ్లెట్లు రాణించడం సంతోషకరమన్నారు.

## హాకీ, క్రికెట్, కబడ్డీలో స్వర్ణాలు

ఆసియా క్రీడల్లో భారత మహిళలు, పురుషుల హాకీ జట్లతో పాటు రెండు క్రికెట్ జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. మహిళలు, పురుషుల కబడ్డీ జట్లు కూడా పసిడి పతకాలు గెలుచుకున్నాయి. మహిళల హాకీ జట్టు స్వర్ణం సాధించడం ద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని మోదీ పేర్కొన్నారు. మహిళల హాకీ జట్టు ఫైనల్‌లో చైనాను 1-0తో ఓడించి స్వర్ణం సాధించడంతో పాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పురుషుల జట్టు ఫైనల్‌లో మలేషియాను 5-1తో ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకోవడంతో పాటు ఒలింపిక్స్ బెర్తును ఖాయం చేసుకుంది. ఈ సందర్భంగా ఇరు జట్ల సభ్యులు తమ జెర్సీలను ప్రధానమంత్రికి బహూకరించారు.

## కొత్త రికార్డులు సృష్టించాలని పిలుపు

భారత క్రీడా రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మోదీ సూచించారు. ప్రతి మైదానంలో త్రివర్ణ పతాకానికి గౌరవం తీసుకురావడం, అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడలకు కొత్త గుర్తింపు సాధించడం, ప్రతి విభాగంలో కొత్త ఛాంపియన్లను తయారు చేయడం, సరికొత్త రికార్డులు నెలకొల్పడం వంటి లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేయాలని కోరారు. విజయాలు ఒక్కరోజులో సాధ్యం కావని, వాటి కోసం ఏళ్ల తరబడి పట్టుదలతో శ్రమించాల్సి ఉంటుందని అన్నారు. గత 12 ఏళ్లుగా దేశంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఒకప్పుడు కొన్ని క్రీడలకు మాత్రమే పరిమితమైన భారత్.. ఇప్పుడు విభిన్న క్రీడాంశాల్లో పాల్గొంటూ పతకాలు సాధించే స్థాయికి చేరుతోందని మోదీ పేర్కొన్నారు.




# స్మృతి మంధాన ముందు ప్రపంచ రికార్డు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు కెప్టెన్‌గా తొలి సవాల్ ఎదురుకానుంది. భారత్, జింబాబ్వే మహిళల జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబరు 16 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో పూర్తిస్థాయి సారథిగా బరిలోకి దిగనున్న మంధాన.. తొలి మ్యాచ్‌లోనే జట్టుకు విజయాన్ని అందించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు, ఈ సిరీస్‌లో ఆమె ముందు అరుదైన ప్రపంచ రికార్డు కూడా ఉంది.

## మరో 133 పరుగులు చేస్తే చరిత్ర!

అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్‌లో 5,000 పరుగుల మైలురాయిని చేరుకోవడానికి స్మృతి మంధానకు మరో 133 పరుగులు అవసరం. ఈ లక్ష్యాన్ని చేరుకుంటే అంతర్జాతీయ మహిళల టీ20ల్లో 5,000 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా ఆమె చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు 179 మ్యాచ్‌ల్లో 4,867 పరుగులు సాధించిన మంధాన ఖాతాలో రెండు శతకాలు, 37 అర్ధశతకాలు ఉన్నాయి. ఆమె స్ట్రైక్‌రేట్ 127.5గా ఉంది. జింబాబ్వేతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోనే ఈ ఘనత సాధించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## అత్యధిక పరుగుల జాబితాలో అగ్రస్థానానికి చేరువగా..

మహిళల అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మంధాన ముందంజలో ఉంది. న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ 4,758 పరుగులతో తర్వాతి స్థానంలో ఉండగా, హర్మన్‌ప్రీత్ కౌర్ 4,327 పరుగులు, శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు 4,282 పరుగులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సిరీస్‌లో మంధాన తన బ్యాటింగ్ జోరును కొనసాగిస్తే 5,000 పరుగుల మైలురాయిని అందుకోవడంతో పాటు తన రికార్డును మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంది.

## కెప్టెన్‌గా తొలి పరీక్ష

సారథ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత మంధానకు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. జట్టును ముందుండి నడిపించడంతో పాటు బ్యాటర్‌గా కూడా రాణించాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు అక్టోబరు 16, 18, 20 తేదీల్లో జరగనున్నట్లు సమాచారం. ఈ మ్యాచ్‌లకు రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించడంతో పాటు వ్యక్తిగతంగా ప్రపంచ రికార్డును అందుకోవడంపై మంధాన దృష్టి సారించనుంది.

# అవార్డుల బరువుతో హోప్ సరదా వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 15 :** భారత పర్యటనలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ పరుగుల వరద పారిస్తున్నాడు. వన్డేల్లోనే కాకుండా టీ20ల్లోనూ భారత బౌలర్లకు సవాల్ విసురుతూ వరుస శతకాలతో అదరగొడుతున్నాడు. ఈ పర్యటనలో ఇప్పటికే మూడుసార్లు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్నాడు. వరుస విజయాలతో ఆనందంలో ఉన్న హోప్.. అవార్డులన్నింటినీ స్వదేశానికి ఎలా తీసుకెళ్లాలంటూ సరదాగా వ్యాఖ్యానించాడు.






## వన్డేల్లోనూ.. టీ20ల్లోనూ శతకాల మోత

వన్డే సిరీస్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన షాయ్ హోప్.. పొట్టి క్రికెట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. వన్డేల్లో గువాహటిలో 104 పరుగులు, న్యూ ఛండీగఢ్‌లో అజేయంగా 162 పరుగులు చేసి తన సత్తా చాటాడు. తాజాగా టీ20 సిరీస్‌లోనూ రాంచీలో అజేయంగా 102 పరుగులు, హైదరాబాద్‌లో మరో అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. ఫార్మాట్ మారినా తన దూకుడు తగ్గదని నిరూపిస్తూ వెస్టిండీస్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

## అవార్డులన్నీ ఎలా తీసుకెళ్లాలి?

భారత్‌పై కీలక ఇన్నింగ్స్‌లు ఆడి మూడు సార్లు మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటగాడి అవార్డును అందుకోవడంపై హోప్ సంతోషం వ్యక్తం చేశాడు. అదే సమయంలో అవార్డుల బరువు గురించి సరదాగా మాట్లాడాడు. స్వదేశానికి తిరిగి వెళ్లేటప్పుడు విమానాశ్రయంలో లగేజీ బరువు తనిఖీల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చమత్కరించాడు. అవార్డులు గెలవడం ఆనందంగా ఉన్నా.. వాటన్నింటినీ తీసుకెళ్లడం మరో సమస్యగా మారిందన్నది అతడి వ్యాఖ్యల సారాంశం.

## చివరి మ్యాచ్‌పైనా హోప్ దృష్టి

భారత పర్యటనలో బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న హోప్.. సిరీస్‌లో తన జట్టు విజయ పరంపరను కొనసాగించాలని భావిస్తున్నాడు. కీలక సమయాల్లో పరుగులు సాధిస్తూ జట్టుకు అండగా నిలుస్తున్న అతడు, నిర్ణయాత్మక మ్యాచ్‌లోనూ ఇదే ప్రదర్శన పునరావృతం చేయాలని పట్టుదలతో ఉన్నాడు. హోప్ ఫామ్ వెస్టిండీస్‌కు బలంగా మారగా, అతడిని కట్టడి చేయడం భారత బౌలర్లకు సవాల్‌గా మారింది.

# అగార్కర్ స్థానంలో కొత్త ఛైర్మన్ ఎవరు?

**ముంబై, అక్టోబరు 15 :** 2027 వన్డే ప్రపంచకప్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత క్రికెట్ జట్టు ఎంపికలపై బీసీసీఐ దృష్టి సారించింది. సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ప్రపంచకప్‌కు ముందు జట్టు ఎంపిక విధానంలో పెద్దగా మార్పులు చేయకుండా ప్రస్తుత వ్యవస్థనే కొనసాగించాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజాను కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతోంది.





## ఓజా కొనసాగింపుపై ఊహాగానాలు

అగార్కర్ పదవీకాలం పొడిగింపు కోరుకోవడం లేదన్న ప్రచారం నేపథ్యంలో కొత్త ఛైర్మన్ ఎంపికపై ఆసక్తి నెలకొంది. కొత్త వ్యక్తి బాధ్యతలు చేపడితే జట్టు ఎంపికలో ఆయన అనుసరించే విధానం, నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. ప్రపంచకప్ సన్నాహాల సమయంలో ఎంపికల విధానంలో మార్పులు చోటుచేసుకోకుండా చూడాలని బీసీసీఐ భావిస్తున్నట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ కారణంగా ప్రజ్ఞాన్ ఓజానే మరికొంతకాలం తాత్కాలిక ఛైర్మన్‌గా కొనసాగించవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## లక్ష్మణ్ ప్రభావం పెరుగుతుందా?

బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు నేతృత్వం వహిస్తున్న మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రభావం జట్టు ఎంపికల వ్యవహారంలో పెరిగే అవకాశం ఉందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచకప్‌కు ముందు ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికల్లో స్థిరత్వాన్ని కొనసాగించడం బోర్డుకు కీలకంగా మారింది.

## పార్థివ్ పటేల్ దరఖాస్తు చేయలేదా?

వెస్ట్ జోన్ నుంచి ఖాళీ అయిన సెలక్టర్ పదవికి దరఖాస్తుల గడువు అక్టోబరు 14తో ముగిసినట్లు సమాచారం. మాజీ భారత వికెట్ కీపర్ బ్యాటర్ పార్థివ్ పటేల్ ఈ పదవికి దరఖాస్తు చేస్తారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన దరఖాస్తు చేయలేదని కొన్ని వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ విషయంపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

## ఎస్ఎస్ దాస్ పదవీకాలంపై చర్చ

ప్రస్తుత సెలక్షన్ కమిటీలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా సభ్యులుగా ఉన్నారు. దాస్ డిసెంబరుతో సెలక్టర్‌గా నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోనున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఆయనను 2027 ప్రపంచకప్ వరకు కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే కొత్త ఛైర్మన్ నియామకం, ఓజా కొనసాగింపు, ఇతర సభ్యుల పదవీకాలంపై బీసీసీఐ అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో సెలక్షన్ కమిటీలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# సన్నీ డియోల్‌తో ప్రగ్యా జైస్వాల్!



**హైదరాబాద్, అక్టోబరు 15 :** టాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక ప్రగ్యా జైస్వాల్ బాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే అక్షయ్ కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలో కనిపించిన ఆమె.. ఇప్పుడు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సన్నీ డియోల్ నటిస్తున్న 'సూర్య' సినిమాలో భాగమయ్యారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాన్ని విడుదల చేయడంతో పాటు, విడుదల తేదీని కూడా చిత్రబృందం ప్రకటించింది. ఎం. పద్మకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య' చిత్రంలో సన్నీ డియోల్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రవికిషన్, మనీష్ వాధ్వా తదితరులు కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కమల్ ముకుత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రాన్ని నవంబరు 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. 2018లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న మలయాళ క్రైమ్ థ్రిల్లర్ 'జోసెఫ్' ఆధారంగా 'సూర్య' తెరకెక్కుతోంది. ఈ కథ ఇప్పటికే తెలుగులో రాజశేఖర్ కథానాయకుడిగా 'శేఖర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళం, కన్నడ భాషల్లోనూ పునర్నిర్మాణమైంది. మరో విశేషం ఏమిటంటే, మలయాళ మూల చిత్రానికి దర్శకత్వం వహించిన ఎం. పద్మకుమారే హిందీ రూపాంతరానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా జైస్వాల్.. ఇప్పుడు బాలీవుడ్‌లో వరుస అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు. సన్నీ డియోల్ వంటి ప్రముఖ నటుడితో కలిసి నటిస్తున్న 'సూర్య' ఆమె కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి. నవంబరు 20న విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో తెలియాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.




# కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి' టీజర్ విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 15 :** జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అధికారిక టీజర్ తాజాగా విడుదలైంది. హాస్యం, న్యాయస్థానం నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. నవంబరు 20, 2026న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చిన్నప్పటి నుంచి న్యాయవాది కావాలనే లక్ష్యంతో కుటుంబాన్ని ఎదురించి న్యాయశాస్త్రం చదివిన సావిత్రి అనే యువతి పాత్రలో కీర్తి సురేశ్ నటిస్తున్నారు. ఆమె వృత్తి జీవితంలో చేపట్టిన తొలి కేసు చుట్టూ కథ సాగుతుంది. న్యాయస్థానంలో ఆమె ఎదుర్కొనే సవాళ్లు, అమాయకంగా చేసే వాదనలు టీజర్‌లో నవ్వులు పూయిస్తున్నాయి. గంభీరమైన కోర్టు వాతావరణాన్ని వినోదాత్మకంగా చూపిస్తూ సినిమా కథపై ఆసక్తిని పెంచారు. ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ ఈ చిత్రంలో మార్కండేయన్ అనే శక్తిమంతమైన న్యాయవాది పాత్రలో కనిపించనున్నారు. న్యాయస్థానంలో సావిత్రికి ప్రత్యర్థిగా ఆయన చేసే వాదనలు, కీర్తి సురేశ్‌తో జరిగే పోటీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి మధ్య సాగే కోర్టు సన్నివేశాలు ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, బాలాజీ శక్తివేల్, ఆర్. సుందర్రాజన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, అరుణ్ విన్సెంట్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. న్యాయస్థానంలో జరిగే వాదోపవాదాలను హాస్యం, వినోదంతో మేళవించి రూపొందించిన 'సత్యవాన్ సావిత్రి' నవంబరు 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తి సురేశ్ నటన, మిస్కిన్‌తో ఆమె తలపడే సన్నివేశాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ఆశిస్తోంది.



అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ గత తొమ్మిది నెలలుగా ఒక్క సినిమాకూ అంగీకారం తెలపలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తనకు సినిమాల్లో నటించే అవకాశాలు వస్తున్నప్పటికీ, కథలు మనసుకు నచ్చకపోవడంతో కొత్త చిత్రాలకు అంగీకరించడం లేదని మృణాల్ తెలిపింది. గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదని స్పష్టం చేసింది. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలల సమయాన్ని కేటాయించాల్సి ఉంటుందని, అంత సమయం వెచ్చించాలంటే కథలో ప్రత్యేకత ఉండాలని అభిప్రాయపడింది. అందుకే కొంతకాలం సినిమాలకు విరామం తీసుకున్నట్లు వివరించింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆమె చిత్రీకరణలోనూ పాల్గొంటున్నట్లు ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. మృణాల్ తాజా వ్యాఖ్యలతో ఆమె ఈ చిత్రంలో నటిస్తుందా లేదా అన్న అంశంపై మరింత ఆసక్తి నెలకొంది. అధికారిక సమాచారం వెలువడితేనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సినిమా రంగంపై ఆనంది భావోద్వేగం

**హైదరాబాద్, అక్టోబరు 15:** సినీ పరిశ్రమలో అవకాశాలు అందుకోవడం, నటిగా గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభం కాదని నటి ఆనంది అన్నారు. కొన్నిసార్లు ఈ రంగంలో కొనసాగడం తనకు కష్టంగా అనిపిస్తుందని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె నటించిన 'గరివిడి లక్ష్మి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన వేడుకలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ఒక్కోసారి నేను ఈ సినిమా రంగానికి సరిపోనేమో అనిపిస్తుంది. ఇక్కడ సినిమాలు చేయాలంటే ఎన్నో లెక్కలు, సమీకరణాలు, రాజకీయాలు ఉంటాయి' అంటూ ఆనంది తన మనసులోని మాటలను వెల్లడించారు. ప్రతిభతో పాటు పరిశ్రమలోని పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి



వస్తుందని ఆమె వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. అయితే ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్న దానిపై స్పష్టత లేదు. 'గరివిడి లక్ష్మి' చిత్రంలో ఆనంది ప్రధాన పాత్ర పోషించారు. ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి రెడ్డి విజయలక్ష్మి జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందినట్లు సమాచారం. ఈ పాత్రలో సహజంగా కనిపించేందుకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలికంలో మాట్లాడేందుకు ఎంతో కష్టపడ్డానని ఆనంది తెలిపారు. ఈ చిత్రం ద్వారా ఆ కళాకారిణికి మరింత గుర్తింపు లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు. బుర్రకథ కళాకారిణిగా గరివిడి లక్ష్మి సాధించిన గుర్తింపు, ఆమె జీవితంలో ఎదురైన సవాళ్లు, చేసిన పోరాటాలను ఈ చిత్రంలో చూపించనున్నట్లు తెలుస్తోంది. పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న జానపద కళారంగంలో ఒక మహిళగా అడుగుపెట్టి తన ప్రతిభతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. నిజజీవిత కళాకారిణి పాత్రను తెరపై ఆవిష్కరించేందుకు ఆనంది చేసిన కృషి ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది.

# సాయిదుర్గా తేజ్ 19వ సినిమా ప్రకటన

**హైదరాబాద్, అక్టోబరు 15 :** మెగా హీరో సాయిదుర్గా తేజ్ తన తదుపరి చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా కెరీర్‌లో 19వ సినిమాను ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న తేజ కనుమ దర్శకత్వం వహించనున్నారు. కుటుంబ సంబంధాలు, హాస్యం, వినోదంతో కూడిన కథాంశాలకు పేరుపొందిన తేజ కనుమ.. ఇప్పుడు సాయిదుర్గా తేజ్‌తో కలిసి సినిమా చేయనుండటం ఆసక్తికరంగా మారింది. ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సేవ్ ది టైగర్స్' సిరీస్‌తో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి వెండితెరపై మెగా హీరోను ఎలా చూపించబోతున్నారనే చర్చ మొదలైంది. ఈ సినిమా కథాంశం ఏమిటి? సాయిదుర్గా తేజ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రస్తుతం హీరో, దర్శకుడు, నిర్మాణ సంస్థ వివరాలను మాత్రమే ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో 19వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్టును ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ హీరో, తేజ కనుమతో ఎలాంటి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంపైనా అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఒకవైపు ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తూనే, మరోవైపు కొత్త సినిమాను ప్రకటించడం ద్వారా తన తదుపరి చిత్ర ప్రయాణానికి ఆయన సిద్ధమవుతున్నారు. పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటన రావడంతో అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




# పుట్టపర్తిలో విజయ్-రష్మిక పూజలు

**పుట్టపర్తి, అక్టోబరు 15 :** టాలీవుడ్ ప్రముఖ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. తమ చిత్రం 'రణబాలి' విడుదల వేళ ఈ జంట సత్యసాయి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో జరుగుతున్న వార్షిక వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం కార్యక్రమాల్లో భాగంగా విజయ్, రష్మిక సాయి కుల్వంత్ హాల్‌ను సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ జంట కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ్ దేవరకొండకు శ్రీసత్యసాయి విద్యాసంస్థలతో ప్రత్యేక అనుబంధం ఉండటంతో ఆయన పుట్టపర్తి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. విజయ్, రష్మిక కలిసి పూజల్లో పాల్గొన్న దృశ్యాలు, ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ





- జిల్లా కలెక్టర్ కె.హరిత
- కొమరం భీమ్ ప్రాజెక్ట్ ఒడ్డున ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను పేర్చి దేవతగా పూజింపబడే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొమరం భీమ్ ప్రాజెక్టు ఒడ్డున జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలను జిల్లా ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ఏఎంసీ చైర్మన్ మంగ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ లతో కలిసి గౌరమ్మను పూజించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన కొమరం భీమ్ ప్రాజెక్ట్ ఒడ్డున నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతం యొక్క విశిష్టతను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటి చెబుతుందని, మహిళల ఐక్యతకు, ప్రకృతి పట్ల ఆరాధనకు, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించాలని, సాంప్రదాయమైన పాటలు పాడుతూ, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం చాలా సంతోషకరమని తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, ఐ కె పి సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తాంసి మండలం బండల్ నాగాపూర్ గ్రామంలో భూభారతి, రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రూతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో భూ రీ సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. దీంతో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం కేటాయించిన 11 రోవర్లతో పాటు, జిల్లా ఫండ్ నుంచి మరో 8 రోవర్లను కొనుగోలు చేసి మండల సర్వేయర్లకు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా క్యాడస్ట్రల్ మ్యాప్స్ ఉన్నవి, లేనివి కలిపి మొత్తం 78 గ్రామాల్లో రీ సర్వే చేపడుతున్నట్లు వివరించారు. ఈ రీ సర్వే ద్వారా కుటుంబ గొడవలు, దారి వివాదాలు, నక్షాబాట తగాదాలు పూర్తిగా తొలగిపోతాయని, భూదార్ కార్డు ద్వారా భూ సమస్యలకు శాశ్వత మోక్షం కలుగుతుందన్నారు. సోయాబీన్ పంట తొలగింపు తర్వాత రైతులు ఎక్కువ కాలం తీసుకునే జొన్న పంట వైపు వెళ్లకుండా, తక్కువ కాలపరిమితి కలిగిన శనగ, పెసర్లు, మినుములు, నువ్వులు వంటి తక్కువ నీటి వనరులు సరిపోయే పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి సౌకర్యం, డ్రిప్, స్ప్రింకర్లు ఉన్న రైతులు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలైన బంతి పూలు, టమాట లాంటి వాటిని సాగు చేస్తే ప్రభుత్వం నుంచి తగిన సబ్సిడీలు అందడంతో పాటు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకొని గ్రామంలోని రామాలయంలో ప్రతిష్టించిన దుర్గామాత ప్రతిమను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ రీ సర్వే పరిశీలనలో ల్యాండ్ ఏడీ సర్వే ప్రభాకర్, తహశీల్దార్ మధుసూదన్, గ్రామస్థులు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 30న ఇంద్రవెల్లి గడ్డపై పాంచజన్య సంకల్ప సభ

- పోస్టర్లను విడుదల చేసిన టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపురావు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇంద్రవెల్లి గడ్డపై ఈనెల 30న నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ వివిధ జిల్లాల ఇన్చార్జిలతో కలిసి నాగోబా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సభ నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు. ఈనెల 30న జరిగే సభ పోస్టర్ ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక నియోజకవర్గాల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, తెలంగాణకు మహిళా ముఖ్యమంత్రిగా కవిత ఎన్నిక కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. పాంచజన్య సంకల్ప సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, సభకు సంబంధించి ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడా జనార్ధన్, సభ పర్యవేక్షకురాలు లలిత, విక్రాంత్ రెడ్డి, ఖానాపూర్ అసెంబ్లీ ఇన్చార్జ్ మెస్రం దయాకర్, పార్లమెంట్ ఇన్చార్జ్ మాడవి బాపురావు, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్చార్జ్ వేణుగోపాల్ యాదవ్, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల, నియోజకవర్గాల ఇన్చార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి చలమాల సూర్యనారాయణ

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తాను నమ్మిన సిద్ధాంతం కోసం, పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి చలమాల సూర్యనారాయణ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు అన్నారు. గురువారం వీఎం బంజర్లోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు నల్లమల అరుణ్ ప్రతాప్ అధ్యక్షతన చలమాల సూర్యనారాయణ 43వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టులపై కాంగ్రెస్ పెత్తందారులు అణచివేత ధోరణి అవలంభిస్తున్న రోజుల్లో, కాంగ్రెస్ విధానాలను విభేదించి సీపీఎంలో చేరిన చలమాల సూర్యనారాయణ అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పెనుబల్లి మండలంలో బూర్జువా శక్తులను ఎదుర్కొంటూ ముందుకు సాగారని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తికి ఆకర్షితులైన అనేక మంది యువకులు ఆయన వెంట నడిచారని పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా చివరివరకు పార్టీకి అంకితభావంతో పనిచేశారని అన్నారు. పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సూర్యనారాయణ ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు నేటి పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాండ్ర రాజేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మిట్టపల్లి నాగమణి, కర్రీ రజిని, చలమాల నరసింహారావు, హమాలీ యూనియన్ అధ్యక్షుడు మిద్దె స్వామి, కాంగ్రెస్ నాయకులు వంగ గిరిజపతి, మల్లెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# నేడు సింగరేణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** గోలేటి సింగరేణి హైస్కూల్ మైదానం, మాదారం రామాలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికార ప్రతినిధి (డీజీఎం పర్సనల్) దేవరకొండ కిరణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆకర్షణీయంగా పేర్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నిర్ణీత పరిమాణం గల బతుకమ్మతో వచ్చి బతుకమ్మ ఆట పాటలో పాల్గొన్న ప్రతి మహిళకు న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు బహుమతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గోలేటి గ్రామానికి బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని (ఫ్యామిలీ డే) బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# అమ్మవారి విగ్రహం అందించిన దాత దంపతులకు సన్మానం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని గుడిపేట గ్రామపంచాయతీ పరిధిలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని అందించిన దాత కారోబారి సుద్దాల సుజాత–తిరుపతి దంపతులను గ్రామ పూజారి, గ్రామ పటేల్ ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాత దంపతులను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకరించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా సుజాత–తిరుపతి దంపతులు అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వారి కుటుంబంపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు దాతలు అందించిన సహకారం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# రావణ దహనం ఏర్పాట్లను పరిశీలించిన చైర్ పర్సన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ లో గల రావణ దహన మైదానాన్ని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ వార్డ్ కౌన్సిలర్ సాయిచరణ్ గౌడ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ లతో కలిసి గురువారం పరిశీలించారు. విజయదశమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం, కౌన్సిలర్, ఉత్సవ సమితి సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదానాన్ని జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్లతో శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం మెరుగైన లైటింగ్, పటిష్టమైన స్టేజ్, నిరంతర పారిశుద్ధ్య పనులు మున్సిపాలిటీ, స్థానిక కౌన్సిలర్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. హిందూ ఉత్సవ సమితి సూచనల మేరకు అన్ని సౌకర్యాలు ముందుగానే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఉత్సవ సమితి సభ్యులతో కలిసి వేడుకల విజయవంతానికి ప్రణాళికలు చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగల వేళ రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాగజ్నగర్ పట్టణంలోని రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చి, రహదారులకు మరమ్మతులు చేపట్టాలని 25వ వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ గురువారం అధికారులను కోరారు. పట్టణంలోని పలు రహదారులపై గుంతల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. పండుగల సమయంలో ప్రజల రాకపోకలు పెరిగే నేపథ్యంలో రహదారుల మరమ్మతులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డు గుంతలను పూడ్చి రహదారులను ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయాల్లోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహశీల్దార్, సిబ్బందితో పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా దావాలు, అభ్యంతరాల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ సర్టిఫికెట్లు, భూ భారతి ద్వారా అందిన దరఖాస్తులు, జిఓ ఎంఎస్ నం.59, భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత కాల పరిమితిలోగా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ధృవీకరణ పత్రాల కోసం నిరీక్షించకుండా పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సూపరింటెండెంట్లు, సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్లో ఉన్న అన్నిరకాల ఫైళ్ల పురోగతిపై విభాగాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫైలును గడువులోగా పరిష్కరించాలని, కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని తెలిపారు. కార్యాలయ ఫైల్స్, రికార్డులను పక్కాగా నిర్వహించాలని, రికార్డుల భద్రత, నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి విభాగం సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తొడసం రాజేందర్ తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఇటీవల 15 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు, రెండు కొత్త డీటీఆర్ ట్రాన్స్ఫార్మర్లను అమర్చినట్లు పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సౌకర్యాలు అందించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజల అవసరాలను గుర్తించి మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్.మాధవి సూచించారు. వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటోమోటివ్ సర్వీస్ అడ్వైజర్ విభాగంలో 30, ఆటోమోటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో 30, ఆటోమోటివ్ స్పేర్స్ పిక్కర్ విభాగంలో 15, టెలీకాలర్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో 15, యాక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో 10 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 100 ఉద్యోగ ఖాళీలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆటోమోటివ్ సర్వీస్ అడ్వైజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్, డిప్లొమా, బీటెక్, బీఈ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 19 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని వివరించారు. ఆటోమోటివ్ స్పేర్స్ పిక్కర్ పోస్టులకు ఐటీఐ, ఇంటర్, టెలీకాలర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, యాక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు వేతనం అందుతుందని, శిక్షణ సమయంలో ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17న తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఖమ్మంలోని ముస్తాఫానగర్ వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్కు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం హెచ్ఆర్ ఫోన్ నంబర్లు 7729992061, 926260743ను సంప్రదించాలని తెలిపారు.

# పల్లెల్లో గుడుంబా చిచ్చు..!

- మత్తులో యువత.. రోడ్డున పడుతున్న పేద బతుకులు
- అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న సారా మాఫియా

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలో గుడుంబా దందా మళ్లీ విజృంభిస్తున్నట్లు తెలుస్తోంది. గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం నిఘా ఉన్నప్పటికీ కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా బట్టీలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

**అడవుల్లో తయారీ.. విధుల్లో విఫలమవుతున్నారా..?**

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల పరిసర ప్రాంతాలను కేంద్రాలుగా మార్చుకొని అక్రమార్కులు గుడుంబా తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా తయారు చేసిన గుడుంబాను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ విక్రయిస్తున్నట్లు సమాచారం. అధికారుల నిఘా ఉన్నప్పటికీ ఈ దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**మత్తుకు బానిసవుతున్న యువత..**

గుడుంబాతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యువత మత్తుకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. గుడుంబా కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

**ప్రజాణాలు తీస్తున్న కల్తీ విషం..**

సారా తయారీకి ఉపయోగించే పదార్థాలు, తయారీ విధానంపై సరైన పర్యవేక్షణ లేకపోతే ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. కల్తీ సారా కారణంగా ప్రాణనష్టం జరిగే ప్రమాదం కూడా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించాలని కోరుతున్నారు. గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. మారుమూల గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమంగా సారా తయారు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గుడుంబా ద్వారా కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని కోరుతున్నారు.



# రూ.20లక్షల విలువైన పేలుడు పదార్థాలు పట్టివేత






- 20వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు స్వాధీనం
- ఏడుగురు అరెస్ట్, మరో ఇద్దరిపై కేసు
- ఉత్తర్ ప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమ రవాణా
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** లైసెన్స్, అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.20 లక్షల విలువైన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. జైనథ్ మండలం పిప్పర్వాడ టోల్ప్లాజా సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 20వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు, రెండు వాహనాలు, ఆరు సెల్ఫోన్లను పట్టుకున్నారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పర్వాడ టోల్ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీలు చేపడుతుండగా, రెండు వాహనాల్లో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో నిందితులు ఉత్తర్ ప్రదేశ్కు చెందిన రవికుమార్ ద్వారా పేలుడు పదార్థాలను సమకూర్చుకుంటున్నట్లు గుర్తించారు. అక్కడి కంపెనీ నుంచి ఇతరుల పేర్లతో బిల్లులు తీసుకొని, బూస్టర్ బాక్సుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నింపి తెలంగాణకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం వాటిని మైన్స్, క్వారీలు, క్రషర్లకు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. నిందితులు రెండు వాహనాల్లో ఉత్తర్ ప్రదేశ్కు వెళ్లి పేలుడు పదార్థాలను తీసుకొస్తుండగా పట్టుబడ్డారు. ఈ అక్రమ రవాణాలో మరెవరైనా పాల్గొన్నారా, పేలుడు పదార్థాలను ఎవరికి సరఫరా చేయాలనుకున్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

**రూ.19.15 లక్షల పేలుడు పదార్థాలు స్వాధీనం..**

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 20వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, రూ.19 లక్షల అంచనా విలువైనవి, 90 బూస్టర్లు, రూ.15వేల విలువైనవి ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వీటితో పాటు బొలెరో వాహనం, హోండా సిటీ కారు, ఆరు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పేలుడు పదార్థాల విలువ రూ.19.15 లక్షలు కాగా, వాహనాల విలువను కలుపుకొని స్వాధీనం వాటి విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని వివరించారు.

**ఏడుగురు నిందితుల అరెస్ట్..**

ఈ కేసులో చెప్యాల పరశురాము, వల్లెపు తేజ, కదం శ్రావణ్, కస్తూరి సునీల్, సూర రంజిత్, కస్తూరి మధు కిరణ్, పాగల సంపత్ రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు ఎండి. వాహిద్, రవికుమార్ల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను రవాణా చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి.శ్రావణ్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై పి.గౌతమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గ రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి

**మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలో రైతులకు వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోర్ల కింద పంటలు సాగు చేస్తున్న రైతులు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరు నుంచి ఏడు గంటలు కూడా సక్రమంగా కరెంటు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోనివ్వమని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందించి వారి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటించారని, ప్రస్తుతం రైతులకు ఆ స్థాయిలో విద్యుత్ అందడం లేదని పేర్కొన్నారు. రైతులు విద్యుత్ కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం, రైతుబీమా ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు యూరియా, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. ఒకవైపు రైతులు కరెంటు కోతలతో పంటలు ఎండిపోతాయని ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ, విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. సిర్పూర్ నియోజకవర్గంలోని రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుర్తింపు కార్డులు లేని వారికి ఇల్లు అద్దెకు ఇవ్వొద్దు

- డీఎస్పీ కత్రోజు నాగేంద్రచారి
- 12 గంటల్లోనే పవన్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- యూపీకి చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్



**ఉద్యమ కెరటం, ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో టైల్స్ యజమాని పవన్ హత్య కేసును పోలీసులు 12 గంటల్లోనే ఛేదించి, ఉత్తర్ ప్రదేశ్కు చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుకు గురువారం డీఎస్పీ కత్రోజు నాగేంద్రచారి వెల్లడించారు. డబ్బుల కోసం పవన్ను హత్య చేసిన అనంతరం పరారైన ఉత్తర్ ప్రదేశ్కు చెందిన కూలీలు జోగిందర్, శివమ్లను రామగుండం రైల్వే స్టేషన్లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. అనంతరం వారిని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కత్రోజు నాగేంద్రచారి మాట్లాడుతూ.. నేరాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేసే వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే యజమానులు తప్పనిసరిగా వారి గుర్తింపు కార్డులను పరిశీలించాలని, సరైన గుర్తింపు వివరాలు లేని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. అద్దెకు వచ్చే వారి ఆధార్, పాన్ కార్డుల వంటి గుర్తింపు పత్రాలను పరిశీలించి, వారి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అందించాలని సూచించారు. పోలీసుల పరిశీలన అనంతరం గదులు కేటాయించాలని స్పష్టం చేశారు. గుర్తింపు వివరాలు సరిచూసుకోకుండా అద్దెకు ఇచ్చిన సందర్భంలో, సంబంధిత వ్యక్తులు నేరాలకు పాల్పడితే ఇంటి యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. హత్య కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# గ్రీన్ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం.. డ్రైవర్ మృతి

- ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఐచర్ వాహనం
- వరుస ప్రమాదాలతో వాహనదారుల్లో ఆందోళన

**ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామ సమీపంలోని గ్రీన్ఫీల్డ్ హైవేపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. గ్రీన్ఫీల్డ్ హైవేపై వరుసగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు వాహనదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా హైవేపై వాహనాలు నిలిపి ఉంచే ప్రాంతాలు, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రదేశాల వద్ద తగిన భద్రత చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలి..**

గ్రీన్ఫీల్డ్ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను సంబంధిత అధికారులు గుర్తించి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. హైవేపై వాహనాలు నిలిపే ప్రదేశాల వద్ద తగిన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రాత్రివేళ కనిపించే భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. మరో ప్రాణం ప్రమాదంలో బలికాకముందే సంబంధిత అధికారులు స్పందించి గ్రీన్ఫీల్డ్ హైవేపై రహదారి భద్రతను మెరుగుపర్చాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# అటవీ శాఖ అధికారుల తీరుపై ఆదివాసిల కన్నెర్ర

- సిర్పూర్(యు) లో రెండు గంటల పాటు రాస్తారోకో
- ఆదివాసీల అభివృద్ధికి అటవీ శాఖ అడ్డు రావద్దని డిమాండ్
- ఇబ్బందులకు గురిచేస్తే గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరిక
- అటవీ శాఖ, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు





**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** అటవీ శాఖ అధికారుల తీరుపై ఆదివాసిలు కన్నెర్ర చేశారు. ఏజెన్సీ ఆదివాసి గ్రామాల్లో అటవీ శాఖ అధికారుల పెత్తనం అధికం కాకూడదనే డిమాండ్ తో ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జాతీయ అధ్యక్షులు కోట్నక విజయ్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యలయ సమీపంలోని ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు వందలాది మందితో గురువారం రాస్తా రోకో నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో గల ఆదివాసి పోరాట యోదుడు కుంరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి అటవీ శాఖ కార్యాలయం వరకు సుమారు ఒక కిలో మీటర్ వరకు ఢోలు వాయిస్తూ భారీ ర్యారీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్నక విజయ్ మాట్లాడుతూ సిర్పూర్, జైనూర్, లింగాపూర్ మండలాల్లోని ఆదివాసి గూడాల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసి ప్రజల పట్ల అటవీ శాఖ అధికారులు లేనిపోని ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. ఈ మండలాల్లోని ప్రతి గూడెం నాలపై యేండ్ల చరిత్ర కలిగి ఉందన్నారు. ఇలాంటి గ్రామాలకు అటవీ శాఖ అధికారులు తమ భూముల్లో ఉన్నారంటూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోకుండా, గూడల్లో అంతర్గత రోడ్లను నిర్మించుకోకుండా ఆంక్షలు విదించడం ఎక్కడి న్యాయం అన్నారు. అడవిని నమ్ముకొని నివసిస్తున్న ఆదివాసి ప్రజలను లేనిపోని ఆంక్షలతో ఇబ్బందులకు గురిచేస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. 1/70, పీసా చట్టం ఏజెన్సీ చట్టాలను భారత రాజ్యంగం తమకు కల్పించిందన్నారు. అయినప్పటికి వాటికి విరుద్ధంగా అటవీ శాఖ వ్యవహారిస్తుందన్నారు. ఆదివాసి గూడల్లో అటవీ శాఖ అధికారులు ఆంక్షలు విదించడం సరికాదన్నారు. కొన్ని గ్రామాల్లో ఇండ్లలో అక్రమంగా చొరబడి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాత ముత్తాత కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములు ఇప్పుడు అటవీ శాఖ పరిధిలోనికి ఎలా వెళ్లాయని ప్రశ్నించారు. అడవి తల్లిని, భూములను నమ్ముకొని నివాసం ఉంటున్న ఆదివాసి ప్రజల పట్ల ఇలాంటి ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తే, కుంరంభీం లాగా మరో భూ పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. అటవీ శాఖ కార్యలయాలతో పాటు సీఎం ఇంటిని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే అటవీశాఖ అధికారులను ఆదివాసి గూడాల్లో తిరగనివ్వ బోమని స్పష్టం చేశారు. ఫారెస్టు అధికారులు, సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్లకు సమాదానం చెప్పడానికి అటవీ శాఖ అధికారులు ధర్నాచోటికి రావాలంటూ పట్టుబట్టారు. దీంతో తప్పని పరిస్థితిలో జైనూర్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో జోడే ఘాట్ రేంజ్ అధికారి రమేష్ ధర్నా వద్దకు వచ్చారు. నాయకులు అడిగే ప్రశ్నలకు ఆయన సమాదానం ఇస్తూ ఆదివాసి ప్రజలను తాము కావాలని ఇబ్బంది చేయడం లేదని చెప్పారు. వారి ఆధీనంలో ఉన్న పట్టా భూముల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అటవీ శాఖ పరిధిలో ఉండే భూముల్లో తవ్వకాలు జరపడం, రోడ్లు వేయడం, చెట్లను నరకడం లాంటివి చేసినప్పుడే సమస్య తలెత్తుందన్నారు. ఇలాంటి నిర్మాణాల కోసం అనుమతి తీసుకొని నిర్మించాలన్నారు. అనంతరం ఆదివాసి నాయకులు ఆయనకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, తుడుందెబ్బ జిల్లా నాయకులు కోవా విజయ్ కుమార్, పెందోర్ ప్రభాకర్, మధుకర్, కుంత దీంరావు, పెందోర్ ప్రకాశ్, వివిధ గ్రామాలు, మండలాల నుంచి భారీగా ఆదివాసీలు

# భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

**జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూ భారతి పోర్టల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భూ భారతి పోర్టల్లో పాస్బుక్ డేటా సవరణ సేవపై తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాస్బుక్ డేటా సవరణకు సంబంధించిన విధి విధానాలు, దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. భూ భారతి పోర్టల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులతో పాటు జీఓ నంబర్లు 59, 76కు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన క్షేత్రస్థాయి విచారణలు పూర్తి చేసి, సంబంధిత రికార్డులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు, దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హమైన దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్పాండే, బి, డి, ఎఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో వేములవాడ రూరల్ తహశీల్దార్

- రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి, ప్రైవేట్ ఆపరేటర్



Press Note No.158 Dated: 15.10.2026

TAHSILDAR CUM JOINT SUB-REGISTRAR, O/o THE TAHSILDAR, VEMULAWADA RURAL, RAJANNA SIRICILLA DISTRICT & ONE PRIVATE PERSON IN ACB NET

CELL PHONE NUMBER -1064 (TOLL FREE NUMBER)

P.R.O.
Anti-Corruption Bureau,
T.G., Hyderabad.





**ఉద్యమ కెరటం, వేములవాడ:** వ్యవసాయ భూమి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటూ వేములవాడ రూరల్ తహశీల్దార్ కం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ మహమ్మద్ అబూబకర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆయనతో పాటు భూభారతి ప్రైవేట్ ఆపరేటర్గా పనిచేస్తున్న సంకసాల అనిల్ కుమార్ను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. బాధితుడి అత్తకు చెందిన వ్యవసాయ భూమిని బాధితుడి తండ్రి పేరిట గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆ పని చేసి పెట్టేందుకు తహశీల్దార్ రూ.8వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, పతకం ప్రకారం గురువారం వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ ఆపరేటర్ అనిల్ కుమార్ ద్వారా తహశీల్దార్ అబూబకర్ లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. అనిల్ కుమార్ వద్ద నుంచి లంచం సొమ్ము రూ.8వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని కరీంనగర్లోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపర్చి రిమాండ్కు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ఫ్రీ నం.1064, వాట్సప్ నం.9440446106 ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని 17, 18వ వార్డులను ఆకస్మికంగా సందర్శించి అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యకలాపాలను పరిశీలించారు. 18వ వార్డులో సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు, సాంకేతిక మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. 17వ వార్డులో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించి పూర్తి వివరాలను సేకరించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి అనధికార నిర్మాణాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనధికార నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయించడం, ఆన్లైన్ వ్యవస్థలో వివరాలు నమోదు చేయడం వంటి అంశాల్లో మున్సిపల్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించినట్లు నిర్ధారణ అయితే, వాటిని నిబంధనల ప్రకారం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని 86, 87, 88, 89 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలను సందర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా దావాలు, అభ్యంతరాల విచారణను వేగవంతం చేయాలని సూచించారు. బెల్లంపల్లి ఈఆర్ఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల వివరాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం డెలివరీలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యం అప్పగింతలను వేగవంతం చేసి, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి సీఎంఆర్ డెలివరీపై అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ బియ్యం డెలివరీలో వెనుకబడిన మిల్లులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని తెలిపారు. కొన్ని మిల్లులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో జాప్యం చేస్తున్నాయని అన్నారు. పెండింగ్లో ఉన్న బియ్యం డెలివరీలను తక్షణమే వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం గడువులోగా లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. సీఎంఆర్ బియ్యం అప్పగింతల్లో ఎలాంటి జాప్యం జరగకుండా మిల్లుల యజమానులు తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.